సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం | 23 | ఆగస్టు | 2025



ఖర్చును కంట్రోల్ చేద్దాం

జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు మనకు వివిధ ప్రాంతాల్లో టోల్‌గేట్లు కనిపిస్తాయి. అక్కడ టోల్ (చార్జీ) చెల్లించి ముందుకు వెళ్లాల్సి ఉంటుంది.

-8లో



క్షమాపణ చెప్పలేదని హత్య

రాజమహేంద్రవరంలోని కైలాసభూమి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ధవళేశ్వరానికి చెందిన సతీష్ కుమార్‌ది హత్యగా తేలింది.

-8లో

వీరేశ్వరస్వామికి రూ.లక్ష విరాళం



ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి ఆలయానికి టి.ఉపేంద్రరావు శ్రీదేవి దంపతులు (నరసన్నపేట) రూ. లక్ష విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురం టౌన్: ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని, ఇందుకోసం తాజాగా నిర్వహించనున్న ప్రజా ఉద్యమ నిర్మాణంలో భాగస్వాములు అవుదామని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు పిలుపు నిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, శాసన మండలి పార్టీ ఫ్లోర్ లీడర్ బొత్స సత్యనారాయణ చేపట్టే ప్రజా ఉద్యమాలకు అందరం సిద్ధమవుదామన్నారు. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర బీజేపీ నాయకులు తొలి నుంచి విశాఖ ఉక్కును కాపాడుతున్నామని చెప్పి, రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా విశాఖ ఉక్కు విషయంలో రాష్ట్ర ప్రజలను మభ్య పెడుతూ వచ్చి నేడు ప్రైవేటీకరణకే సిద్ధమైందన్నారు. 2021 జనవరి 21న విశాఖ ఉక్కు పరిశ్రమను నూరుశాతం విక్రయించాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందని ఆయన గుర్తు చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసేందుకు తెర వెనుక ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు అడుగులు వేస్తూనే.. రాష్ట్ర ప్రజలకు మాత్రం ఈ పరిశ్రమ విషయంలో అడుగడుగునా అన్యాయం చేస్తూనే ఉన్నారన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని వైఎస్సార్ సీపీ చేయబోయే ఉద్యమంలో పార్టీ ఎమ్మెల్సీలందరం భాగస్వాములు అవుతామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ నాయకులు దండుమేను రూపేష్, కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూమి హక్కుల నిర్ధారణకే స్వామిత్వ సర్వే



మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: గ్రామాలలో నివసించే ప్రజలకు వారి భూమి హక్కులను నిర్ధారించడానికి, సరిహద్దులను గుర్తించడానికి స్వామిత్వ సర్వే చేపట్టినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెండో దశ స్వామిత్వ సర్వేపై డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్తులకు డిజిటల్ రికార్డులు సృష్టించడం ద్వారా ఆస్తి రికార్డులపై స్పష్టత వస్తుందన్నారు. దీనివల్ల ఆస్తి హక్కుల విషయంలో ఎలాంటి వివాదాలు తలెత్త కుండా ఉంటాయన్నారు. వాటిని అమ్మడం, కొనడం, పెట్టుబడులు పెట్టడం వంటి ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయన్నారు. డ్రోన్ సర్వే పూర్తయిన తర్వాత డిజిటల్ మ్యాప్‌ను గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజల సమక్షంలో తనిఖీ చేస్తారని, ఎవరికైనా తమ ఆస్తి సరిహద్దుల గురించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు.

విద్యార్థుల కెరీర్ గైడెన్స్‌పై కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులు కెరీర్ గైడెన్స్ ద్వారా ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోవడంపై అవగాహనకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. మామిడికుదురు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి, పూర్వపు విద్యార్థి నవీన్ రూపొందించిన కెరీర్ గైడెన్స్ వృక్షాన్ని, 12 ట్రేడులలో శిక్షణ ప్రణాళిక, 52 కోర్సులలో ఎంపికపై పోస్టర్లు, బ్రోచర్లు తదితర విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆసక్తి అనుగుణంగా వివిధ రకాల కోర్సులను ఎంచుకుని, జీవితంలో స్థిరపడాలన్నారు.

- ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించి, వాటిని అధిక ధరలకు అమ్మడం నేరమని కలెక్టర్ అన్నారు. అలా చేసే ప్రైవేట్ డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.



రాజోలు వశిష్ట గోదావరి తీరంలో మునిగిన పార్కు

వరద గోదావరి

- లంక గ్రామాలను చుట్టుముట్టిన వరద
- మునిగిన కాజ్‌వేలు
- మత్స్యకార కాలనీల్లోకి చేరిన నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సాక్షి, అమలాపురం: లంక గ్రామాలను గోదావరి వరద చుట్టుముడుతోంది. ఏటిపట్టు వాసులు, లంక ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. పలు లంక గ్రామాల్లో రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు ముంపు బారిన పడడంతో ప్రజలు ప్రత్యామ్నాయంగా పడవులు, ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తున్నారు. రైతులు పంట ఉత్పత్తులు, పశువులను తరలించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. పశువులను పల్లపు ప్రాంతాల నుంచి ఏటిగట్ల మీదకు తరలించి కాపాలా కాస్తున్నారు. అయితే పశుగ్రాసం పూర్తి స్థాయిలో లేక పశువుల మేపేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులు పడవులు దాటి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. మత్స్యకార నివాసాల చుటూ వరద నీరు చేరడంతో ఇక్కట్లు పాలవుతున్నారు.

లంక వాసుల్లో ఆందోళన

గోదావరి ఉగ్రరూపం దాల్చుతుందని కోనసీమ జిల్లా లంక వాసులు ఆందోళన చెందుతున్న సమయంలో ఎగువన శాంతిస్తుండడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండడంతో అప్రమత్తంగా ఉన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో 13,57,119 క్యూసెక్కులను దిగువకు వదిలారు. తర్వాత రెండు గంటల పాటు నిలకడగా ఉన్న వరద మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి తగ్గుముఖం పట్టింది. సాయంత్రం ఏడు గంటల సమయానికి 13,48,226 క్యూసెక్కుల జలాలు విడిచిపెట్టారు.

పెరుగుతున్న ఉధృతి

ఎగువన శాంతిస్తున్నా కోనసీమలో మాత్రం రాత్రి వరకూ వరద ముంపు పెరుగుతూనే ఉంది. పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో వరద ప్రభావంతో పలు లంక గ్రామాల్లో వరద నీరు చేరింది. గ్రామాలకు వెళ్లే రహదారులు నీట మునిగాయి. నిత్యావసర సరకులు, తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పడవలపై బయట గ్రామాలకు వచ్చి సరకులు తీసుకువెళ్తున్నారు.

ముంపులో పంటలు

లంక భూముల్లోని పంటలన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. కూరగాయ పంటలు, బొప్పాయి, ఎర్ర చక్రకేళి, కంద వంటి వాణిజ్య పంటలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. లంకల్లోని వ్యవసాయ ఉత్పత్తులు, పాల క్యాన్లను రైతులు పడవలపై బయటకు తీసుకు వస్తున్నారు. మధ్య లంకలు వరద నీట మునగడంతో పాడి రైతులు పశువులను ఏటిగట్లపైకి తరలించారు. పశు గ్రాసానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పి.గన్నవరం ఊడిమూడి ఏటిగట్టు దిగువన గుడిసెలు నీట మునిగాయి. ఇక్కడ సంచార జాతి బాధితులు ఇళ్లు వదిలి ఏటిగట్ల మీద తాత్కాలిక గుడారాలు వేసుకున్నారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, అల్లవరం, మామిడికుదురు, సఖినేటిపల్లి మండలాల్లోని లోతట్టు ప్రాంతాలలో నివాసముండే మత్స్యకార ప్రాంతాలు నీట మునిగాయి. ఇక్కడ సుమారు 700 మత్స్యకార కుటుంబాలు నివాసం ఉంటున్నాయని అంచనా. వీరంతా నదీపాయల్లో పడవల మీద వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి నీటి విడుదల

సమయం	నీటి విడుదల (క్యూసెక్కులలో)
తెల్లవారుజాము 3 గంటలు	12,85,832
తెల్లవారుజాము 4 గంటలు	13,00,000
ఉదయం 5 గంటలు	13,05,404
ఉదయం 6 గంటలు	13,14,214
ఉదయం 7 గంటలు	13,22,659
ఉదయం 8 గంటలు	13,31,507
ఉదయం 9 గంటలు	13,31,507
ఉదయం 10 గంటలు	13,31,507
మధ్యాహ్నం 12 గంటలు	13,42,773
మధ్యాహ్నం 1 గంటలకు	13,51,272
మధ్యాహ్నం 2 గంటలు	13,57,119
మధ్యాహ్నం 3 గంటలు	13,57.119
మధ్యాహ్నం 4 గంటలు	13,57,119
సాయంత్రం 6 గంటలు	13,51,272
సాయంత్రం 7 గంటలు	13,48,226



కుండలేశ్వరం పుష్కర ఘాట్‌లో రావిచెట్టు వద్దకు చేరిన నీరు



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి



అయినవిల్లి మండలం ముక్తేశ్వరం- అయినవిల్లిలంక కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద

ఎయిడ్స్‌పై యువతకు అవగాహన అవసరం



విజేతలకు నమూనా చెక్కు అందజేస్తున్న జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ భరతలక్ష్మి

అమలాపురం టౌన్: ఎయిడ్, హెచ్‌ఐవీపై యువత అవగాహన కలిగి ఉండడంతో పాటు వారంతా ఎయిడ్స్ రహిత సమాజాన్ని ఆవిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీహెచ్ భరతలక్ష్మి అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధుల నిర్మూలనపై జిల్లా స్థాయి క్విజ్ పోటీలను శుక్రవారం అమలాపురంలోని మిరియాం కళాశాలలో జిల్లాలోని జూనియర్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించారు. అనంతరం విజేతలకు నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో డాక్టర్ భరతలక్ష్మి మాట్లాడారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బి.యోగా శ్రీవల్లి, వి.సంధ్య మొదటి స్థానంలో, ముమ్మిడివరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇ.కనక మహాలక్ష్మి, జి.శాంతి ద్వితీయ స్థానంలో, రాజోలు శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు బీఎస్ఎన్ సౌమ్య, ఎస్.అలేఖ్య తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున బహుమతులు అందించారు. ఈ విజేతలను త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామని డాక్టర్ భరతలక్ష్మి తెలిపారు. ఎయిడ్స్, లెప్రసీ, టీబీ ప్రోగ్రామ్ అధికారి పి.బాలాజీ, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ ఎ.బుజ్జిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా మానటరింగ్, డేటా ఆఫీసర్ వి.రత్నంరాజు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎయిడ్స్ నియంత్రణ కౌన్సిలర్ జి.కవిత, మిరియాం కళాశాల ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



విలేకరులలో మాట్లాడుతున్న సత్తిబాబు, వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: ఆక్వా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకుడు కె.సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసుకున్న వ్యవసాయ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలన్నారు. స్థానిక గొల్లగూడెంలోని జిల్లా ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ట్రంప్ విధిస్తున్న పన్నులతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో 8.4 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోందని, భారత్ నుంచి ఇతర దేశాలకు 7.16 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రంప్ ఆక్వా ఎగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచడం అన్యాయమన్నారు. ఆక్వా రంగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో అమెరికా చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయించేందుకు చంద్రబాబు స్పందించాలన్నారు. దీనిపై రైతు, కౌలు రైతు సంఘాలు, ప్రజా సంఘాలతో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు పాల్గొన్నారు.

గాజుల గౌరీదేవిగా సుబ్బాలమ్మ



అమలాపురం టౌన్: అమలాపురంలో కొలువైన సుబ్బాలమ్మ అమ్మవారు శుక్రవారం గాజుల గౌరీదేవిగా దర్శనమిచ్చారు. సుమారు 45 వేల గాజులతో అమ్మవారిని అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రావణ మాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో దాదాపు 600 మంది మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమాన్ని ఈవో ఆర్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వ్రతాలు ఆచరించే మహిళలకు వరలక్ష్మి రూపు, పూజా సామగ్రిని దేవస్థానం సమకూర్చింది. దేవస్థానం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి గాజుల అలంకరణకు భక్తులు గాజులు సమర్పించారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయడు, యర్రంశెట్టి మూర్తి, అరిగెల బాబ్జీ, నిమ్మకాయల నాయుడు తదితరుల ఆధ్వర్యంలో అలంకరణ జరిగింది. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ అప్పన వీరన్న, ధర్మకర్తలు పాల్గొన్నారు.

సాంకేతికమక

- స్లాట్‌కు టెక్నికల్ సమస్యలు
- సకాలంలోని రాని ఓటీపీలు
- ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు అవాంతరాలు
- సర్వర్ పనిచేయక ముందుకు సాగని రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- క్రయవిక్రయదారుల అవస్థలు

అమలాపురం టౌన్: రిజిస్ట్రేషన్ శాఖ అమలు చేస్తున్న స్లాట్ బుక్కింగ్‌లో తరచూ సర్వర్ పనిచేయక సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఆస్తుల అమ్మకం, కొనుగోలుదారుల కష్టాలు మరింత ఎక్కువ అయ్యాయి. స్లాట్ బుక్ చేసుకోవడంలో, ఓటీపీలు రావడంలో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ నిర్వహించే సర్వర్ పనిచేయకపోవడంలో తరుచూ ఎదురయ్యే సాంకేతిక సమస్యలే క్రయ విక్రయదారులకు కష్టాలకు కారణమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం సర్వర్ సమస్యను పరిష్కరించడంలో విఫలమైంది.

జిల్లాలో 15 కార్యాలయాలు

జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. 2.0 విధానంలో జిల్లా కేంద్రంలో అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 78 స్లాట్లు, మిగిలిన రిజిస్ట్రార్ కార్యాలయాలకు 34 స్లాట్లకు ఆ శాఖ పరిమితి విధించింది. స్లాట్ బుక్ చేసుకుంటే సూచించిన సమయానికి క్రయ, విక్రయదారులు వస్తే పావు గంటలో రిజిస్ట్రేషన్ తంతు పూర్తవుతుంది. అతి తక్కువ సయయంలో రిజిస్ట్రేషన్ పూర్తవడమే కాకుండా గంటల తరబడి వేచి ఉండాల్సిన పని ఉండదు.

సర్వర్ సమస్యలు

ఆస్తుల రిజిస్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నాక ఫలానా సయయానికి రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాలని ఫోన్‌కు మేసేజ్ వస్తుంది. తీరా ఆ సమాయానికి క్రయ విక్రయదారులు వెళితే సర్వర్ పనిచేయక బుక్ చేసిన స్లాట్ సమయం దాటిపోయి అది సహకరించడంలేదు. అప్పటికే డేటా ఎంట్రీకి చెల్లించిన రూ.600 ఫీజు వృథా అవుతోంది. రీ షెడ్యూలుకు అవకాశం లేకుండా స్లాట్ మళ్లీ బుక్ చేసుకోవాలని సూచించడంతో క్రయ విక్రయదారులు మళ్లీ రూ.600 వెచ్చించి మళ్లీ డేటా ఎంట్రీ చేస్తున్నారు. దీని వల్ల అదనపు ఖర్చుతో పాటు సమయానికి రిజిస్ట్రేషన్ కాకపోవడంతో గంటల తరబడి లేదా రోజంతా అక్కడే పడిగాపులు కాయాల్సివస్తోంది. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతోంది. క్రయ విక్రయదారుల జేబులకు మాత్రం చిల్లులు పడుతున్నాయి.

అదనపు ఖర్చు

అమలాపురం రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం సర్వర్ సమస్యతో బుక్ చేసిన స్లాట్లు సాంకేతికంగా ఫెయిలై, పది పార్టీలు (క్రమ విక్రయదారులు) మళ్లీ రూ.600 అదనంగా చెల్లించాల్సి వచ్చింది. ఇలా జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజూ సర్వర్ సమస్యతో స్లాట్ల బుకింగ్‌ల్లో, ఓటీపీ రావడంలోనూ ఇబ్బందులు కలుగుతున్నాయి.

ఓటీపీల అవస్థలు

స్లాట్ బుక్ చేసుకున్నాక ఆస్తుల కొనుగోలుదారులకు 4 సార్లు, అమ్మకందార్లకు 2 రెండు సార్లు వారి సెల్ ఫోన్లకు ఓటీపీలు వస్తాయి. ఆ ఓటీపీలను రిజిస్ట్రేషన్ సిబ్బందికి వెను వెంటనే క్రయ విక్రయదారులు చెప్పాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధార్ ఓటీపీల విధానంతో క్రయవిక్రయదారులు అనేక అవస్థలకు గురవుతున్నారు. సర్వర్ సమస్యతో సకాలంలో ఓటీపీలు రాక ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్దే ఎదురు చూపులు చూడాల్సి వస్తోంది. ఆన్‌లైన్ డేటాలో అమ్మకందారుని ఆధార్ నెంబర్ ఎంటర్ చేయగానే ఓటీపీ ద్వారా డేటా ఫిల్ అవుతుంది. గతంలో ఓటీపీలతో నిమిత్తం లేకుండా మాన్యువల్ డేటాను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉండేది. ఒక గంట సేపు సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్తంభిస్తే జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. ఇప్పటికైనా రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం సర్వర్ సమస్యను పరిష్కరించి స్లాట్ బుక్కింగ్, ఓటీపీల ఇబ్బందులను తొలగించాలి. లేని పక్షంలో క్రయ విక్రయదారుల విలువైన సమయాన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఎదురు చూపులతో వృథా చేసినట్లే అవుతుంది.



అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఖర్చును కంట్రోల్ చేద్దాం



టోల్‌గేట్



ఫాస్టాగ్

- టోల్ గేట్ల ఫీజు బాధ తప్పినట్టే
- అమల్లోకి పాస్ విధానం
- రూ.3 వేలతో పొందే అవకాశం
- ఏడాది లేదా 200 ట్రిప్పులకు చెల్లుబాటు

ఐ.పోలవరం: జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు మనకు వివిధ ప్రాంతాల్లో టోల్‌గేట్లు కనిపిస్తాయి. అక్కడ టోల్ (చార్జీ) చెల్లించి ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. నాలుగు చక్రాలు, ఆపైన పెద్ద వాహనాలన్నీ ఈ టోల్ కట్టాల్సిందే. మనం వెళ్లే దారిలో ఎన్నిచోట్ల టోల్ గేట్లు ఉంటే అక్కడ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఒక్కో ట్రిప్పుకు (టోల్‌గేటు) ఇరువైపులా కలిపి రూ.90 నుంచి 200 వరకు ఖర్చవుతుంది. కానీ ఇక నుంచి ఆ భారం లేకుండా జాతీయ ఉపరితల రవాణా సంస్థ (ఎన్‌హెచ్) స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఏడాది పాస్ విధానం తీసువచ్చింది. కార్లు, జీపులు, వ్యాన్లు తదితర వాణిజ్యేతర వాహనాలకు ఇది వర్తిస్తుంది. ఒక్కసారి పాస్ తీసుకుంటే ఏడాది పాటు, లేదా 200 ట్రిప్పులకు అవకాశం ఉంటుంది. ఒక టోల్‌గేట్ దాటితే ఒక ట్రిప్పుగా పరిగణిస్తారు. ఆ దారిలో నాలుగు గేట్లు దాటి, తిరిగి వెనక్కి వస్తే ఎనిమిది ట్రిప్పులు అయినట్టు లెక్క.

దేశవ్యాప్తంగా 1,150 టోల్ గేట్లు

గతంలో నగదు రూపంలో టోల్ ఫీజు వసూలు చేయగా, ఆ తరువాత ఫాస్టాగ్ వచ్చింది. దీని వల్ల టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ జామ్ చాలా వరకూ తగ్గిపోయింది. దేశ వ్యాప్తంగా సుమారు 1,150 వరకు టోల్ గేట్లు ఉన్నాయని అంచనా. కోనసీమ జిల్లాలో 216 జాతీయ రహదారిపై ముమ్మిడివరం మండలం అయినాపురం వద్ద, 216 ఏ జాతీయ రహదారిపై రావులపాలెం మండలం ఈతకోట వద్ద టోల్‌గేట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో ఎన్‌హెచ్ 216పై గొల్లప్రోలు వద్ద, ఎన్‌హెచ్ 16పై కృష్ణవరం వద్ద ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కొవ్వూరు, నల్లజర్ల వద్ద టోల్‌గేట్లు కనిపిస్తాయి.

పాస్ పొందే విధానం

ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్న వాహన యజమానులు తమ ఖాతా నుంచి ఫాస్టాగ్ పాస్ పొందవచ్చు. ఆగస్టు 15 నుంచి పెద్ద ఎత్తున వీటిని కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ పాస్ సొంత కార్లు, వాహనాలకు మాత్రమే వర్తిస్తోంది. బస్సులు, టాక్సీలు, లారీలు, రవాణా, వాణిజ్య వాహనాలకు చెల్లదు. ట్రావెల్స్‌కు వినియోగించే కార్లకు, జీప్‌లకు, వ్యాన్‌లకు కూడా వర్తించదు. ఈ ఫాస్టాగ్ ఏడాది పాస్ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించే జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్ రహదారులలోని అన్ని టోల్ ప్లాజాలలో పనిచేస్తుంది. అయితే ఉత్తరాదిన కొన్ని ఎక్స్‌ప్రెస్ హైవేలపై కూడా ఇది వర్తించదని తాజాగా ఎన్‌హెచ్ ప్రకటించింది.

ఉపయోగాలు ఇవే

కేంద్ర రవాణా, ఉపరితల మంత్రిత్వ శాఖ ఈ ఫాస్టాగ్ ఏడాది పాస్‌ను ప్రవేశపెట్టింది. జాతీయ రహదారిపై సొంత వాహనాల్లో ప్రయాణించే వారికి దీనివల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా ప్రయాణంలో టోల్ గేట్ భారం బాగా తగ్గించుకోవచ్చు. ఉదాహరణకు కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నుంచి విజయవాడ, రావులపాలెం మీదుగా సొంత కారులో వెళ్లి వస్తే, ఇప్పుడున్న టోల్ చార్జీలను బట్టి నాలుగు టోల్ గేట్ల వద్ద దాదాపు రూ.565 వరకు చెల్లించాలి. కానీ వార్షిక ఫాస్టాగ్ కొన్నవారికి కేవలం రూ.120 మాత్రమే అవుతుంది. అదే అమలాపురం నుంచి విశాఖపట్నం వరకు కాకినాడ, కత్తిపూడి మీదుగా వెళ్లేవారు రూ.500 వరకూ చార్జి కట్టాలి. ఇక నుంచి అది రూ.120కి తగ్గిపోతుంది. ఏడాది ఫాస్టాగ్ వల్ల సొంత కార్లు, వ్యాన్లు, జీపులు ఉన్న వారికి టోల్ చార్జీల భారం గణనీయంగా తగ్గుతుంది.

డిజిటల్ రూపంలోనూ..

ఫాస్టాగ్ ఏడాది పాస్‌ను డిజిటల్‌గా తీసుకోవచ్చు. రాజమార్గ్ యాత్ర యాప్‌ను సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పొందవచ్చు. లేదా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా లభిస్తుంది. దీని కోసం రూ.మూడు వేలు చెల్లించాలి. సంబంధిత వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫాస్టాగ్ ఉండాలి. బ్లాక్ లిస్ట్‌లో ఉండకూడదు. సంబంధిత వాహన రిజిస్ట్రేషన్ నంబర్ వివరాలు నమోదు చేయాలి. రూ.3 వేలు చెల్లించిన తర్వాత, ఏడాది పాస్ సంబంధిత వాహన ప్రస్తుత ఫాస్ట్ ట్యాగ్‌కు లింక్ అవుతుంది. ఈ పాస్ ఒక ఏడాది కాలం, లేదా 200 ట్రిప్పులకు మాత్రమే పనిచేస్తుంది. ఈ రెండింటిలో దేని గడువు ముందు అయినా ఇక పనిచేయదు. ఈ పాస్ వల్ల టోల్ చార్జీలు బాగా తగ్గుతాయి.

వాడపల్లిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

- తరలివచ్చిన మహిళలు
- పూజా సామగ్రిని సమకూర్చిన దేవస్థానం



వరలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న పండితులు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న క్షేత్రంలోని ఉత్తర ప్రాంగణంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. సుమారు రెండు వేల మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవదాయ - ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చకులు వాడపల్లి రవికిరణ్, ఖండవిల్లి సాయిరామకృష్ణ తదితరులు ఉదయం కల్యాణ మంటపం వేదికపై వరలక్ష్మీదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు పండితుల మంత్రోచ్చారణ మధ్య డీసీ అండ్ ఈఓ చక్రధరరావుతో పండితులు పూజ చేయించి వ్రతాన్ని ప్రారంభించారు. పూజలో పాల్గొన్న వారందరికీ వరలక్ష్మీదేవి రూపు, పూజా సామగ్రిని దేవస్థానం సమకూర్చింది. అనంతరం పండితులు విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, కుంకుమ పూజల అనంతరం పురాణ వ్యాఖ్యానం నడుమ వరలక్ష్మీదేవి వ్రతం చేయించారు.

25న ఫెన్సింగ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటలకు కాకినాడలోని గెజిటెడ్ ఆఫీసర్స్ భవన్‌లో జిల్లా స్థాయి అండర్ - 17 ఫెన్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి సింహాద్రి పవన్ వికాస్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30న భీమవరంలోని వెస్ట్ బెర్రి స్కూల్లో జరిగే అండర్-17 ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలలో పాల్గొంటారన్నారు. వివరాలకు 95535 28888 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీసీ సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన విద్య



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బీసీ సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల (హెచ్‌డబ్ల్యూఓ)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ హెచ్‌డబ్ల్యూవోల పనితీరును మెరుగు పరుచుకునేందుకు నూతన విధానం తీసుకువచ్చిందన్నారు. విధి నిర్వహణలను విభజించి ప్రతి దానికి కొన్ని మార్కులు కేటాయించిందన్నారు. సెప్టెంబర్ 5వ తేదీ నాటికి రాష్ట్రంలోని వసతి గృహాల్లో 244 మంది నాలుగో తరగతి సిబ్బందిని నియమిస్తామన్నారు. బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాల్లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ బీసీ వెల్ఫేర్ డీసీఎస్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పలేదని స్నేహితుడి హత్య

- ఐదుగురు యువకుల ఘాతుకం
- వీడిన కేసు మిస్టరీ
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



హత్యకు గురైన వేపాడ సతీష్ కుమార్ (ఫైల్)



నిందితులను చూపిస్తున్న పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని కైలాసభూమి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ధవళేశ్వరానికి చెందిన సతీష్ కుమార్‌ది హత్యగా తేలింది. ఈ ఘోరానికి పాల్పడిన అతడి ఐదుగురు స్నేహితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఒకరి భార్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సతీష్ కుమార్ క్షమాపణలు చెప్పలేదనే ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. వేపాడి సతీష్ కుమార్ (22) రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో మూడేళ్లుగా సమోసాలు అమ్ముతు జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 8వ రాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో టీవీ ఎక్కువగా సౌండ్ పెట్టుకుని చూస్తుండగా తండ్రి మందలించడంతో అలిగి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం ఈ నెల 15న కైలాస భూమి వెనుక శవమై కనిపించాడు. ఈ మేరకు టూటౌన్ సీఐ శివ గణేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య జరిగిందిలా..

వేపాడి సతీష్ కుమార్ ఈ నెల 9వ తేదీ తెల్లవారుజామున తోటి స్నేహితులైన ఆల్కాట్ గార్డెన్స్‌కు చెందిన భాగ్ రాధాకాంత్, భాగ్ గౌతం, దొంగ సాధిరాజు, బాలాజీ పేటకు చెందిన మోటూరి రవి, భీమవరానికి చెందిన నమ్మి సూర్య తేజతో కలిసి మద్యం తాగడానికి గోదావరి గట్టు దిగువనున్న కైలాస భూమి శ్మశానం లోపలకు వెళ్లాడు. వారిలో భాగ్ రాధాకాంత్ భార్యపై ముందు రోజు రాత్రి వారు కలిసిన సమయంలో సతీష్ కుమార్ చులకనగా మాట్లాడాడు. దీనిపై క్షమాపణ చెప్పాలని సతీష్ కుమార్‌ను వారందరూ అడిగారు. దానికి అతడు నిరాకరించడంతో పాటు మళ్లీ ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. అప్పటికే పూర్తిగా మద్యం తాగి ఉన్న ఐదుగురూ కోపంతో సతీష్ కుమార్‌పై దాడి చేశారు. నమ్మి సూర్యతేజ పక్కనే ఉన్న కర్ర తీసుకుని తలపై కొట్టడంతో సతీష్ కుమార్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. భాగ్ రాధాకాంత్ ఆ తర్వాత అతడి పీక మీద కాలు వేసి.. మృతి చెందే వరకు గట్టిగా తొక్కాడు. అనంతరం మృతదేహాన్ని ఈడ్చుకుని వెళ్లి గోడ అవతల పారవేసి, ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసును ఛేదించారు. హత్యకు ఉపయోగించిన కర్ర, మృతుడి టీషర్టును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెరవలి: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉసులుమర్రు గ్రామానికి చెందిన ఈతకోట మునియమ్మ ఈ నెల 11వ తేదీన కొత్తపల్లి సూర్యారావు మోటార్ సైకిల్‌పై తణుకు వెళుతోంది. వారిని పెరవలిలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాల పాలైన మునియమ్మను చికిత్స కోసం ముందుగా తణుకు, అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆనాటి నుంచి వైద్యం అందిస్తుండగా ఆరోగ్యం విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ తిరగబడి మహిళా కూలీ మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- గుడ్డిగూడెంలో ఘటన



సుగ్గనబోయిన పద్మ (ఫైల్)



ప్రమాద స్థలంలో ట్రాక్టర్, మహిళా కూలీ మృతదేహం



గోపాలపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

గోపాలపురం: ట్రాక్టర్ తిరగబడి మహిళా కూలీ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే. గుడ్డిగూడెం గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు శుక్రవారం వరినాట్లకు వెళ్లారు. పని ముగించుకుని ట్రాక్టర్‌పై వస్తుండగా గుడ్డిగూడెం వద్ద గల కొవ్వాడ కాలువలోకి ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ తిరగబడింది. ఈ ప్రమాదంలో సుగ్గనబోయిన పద్మ (42) అక్కడికక్కడే మృతి చెందగా, సుగ్గనబోయిన తాయారు, కత్తవ నాగలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. స్వల్ప గాయాలైన అద్ద పోశమ్మ, అడబాల వెంకటలక్ష్మి, సిరిగినీడి రామలక్ష్మి, కత్తవ అచ్చమ్మలకు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందజేశారు. సంఘటనా స్థలాన్ని దేవరపల్లి సీఐ కె.నాగేశ్వర్ నాయక్ పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి ప్రమాద వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిల్పి రాజ్‌కుమార్‌కు పురస్కారం




కొత్తపేట: ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) విశిష్ట సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. జీహెచ్‌పీయూ హానరరీ అవార్డ్స్ సెర్మనీని పురస్కరించుకుని ఆయనను ఎంపిక చేశారు. చెన్నై భారతీయ విద్యాభవన్‌లో శనివారం ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమంలో వుడయార్‌కు అవార్డు అందజేస్తారు.

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అందిస్తున్న పీజీ డిప్లమా ఇన్ యోగా, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 29 వరకు మాత్రమే అవకాశం ఉందని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ తెలిపారు. కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా సహకారంతో నిర్వహిస్తున్న ఈ కోర్సులో ప్రవేశానికి 50 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సు చేసేందుకు వయోపరిమితి లేదని, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఇతర వివరాలకు 73823 08440 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై 25న చలో కలెక్టరేట్



చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాకినాడ సిటీ: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన జాతీయ విద్యావిధానం పేరు చెప్పి విద్యను మొత్తం ప్రైవేటీకరణ, కేంద్రీకరణ, కషాయీకరణ చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్యారంగంలోని పెండింగ్‌లో ఉన్న రూ.64 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 77ను రద్దు చేసి, ప్రైవేట్ కాలేజీలో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింపజేయాలని చెప్పారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచి, హాస్టల్‌కు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నగర అధ్యక్షుడు ఎ.వాసుదేవ్, జిల్లా కమిటీ సభ్యులు చిన్ని, జైశ్రీరామ్, నగర నాయకులు సత్యం, ఆదర్శ్ కార్తిక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడి

ముమ్మిడివరం: మండల పరిధిలోని గేదెల్లంక గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్క పది మందిని గాయపరచింది. దీంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోయారు. గత నెలలో కూడా ఇదే మాదిరిగా 8 మందిని, రెండు ఆవులను కూడా కరిచిందని, వాటిలో ఒక ఆవు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ఏవీ నగరంలో..

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో ఐదుగురిపై పిచ్చికుక్క దాడి చేసింది. రెండు పశువులను తీవ్రంగా గాయపర్చింది. ఆ గ్రామంలో గంగాలమ్మ వీధిలో ఈ ఘటన జరిగింది. బాధితులకు స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించి, అక్కడి నుంచి కాకినాడ ఆస్పత్రికి తీసుకెళ్లి వ్యాక్సినేషన్ చేయించారు. గాయపడిన వారిలో ముగ్గురు పిల్లలు ఉన్నారు.